

జాబ్ మేళాకు స్పందన

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. హెటిరో డ్రగ్స్ లిమిటెడ్ కంపెనీకి 64మంది హాజరు కాగా 36మంది ఎంపికయ్యారు. రెడ్డీస్ లేబొరేటరీస్‌కు 105మంది హాజరు కాగా 65 మంది ఎంపికయ్యారు. ఎస్‌బిఐ కార్డుకు 89 హాజరు కాగా, 47మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రాధాకృష్ణ తెలిపారు. ఎంపికైన వారిని ప్రిన్సిపల్ డాక్టర్ రాధాకృష్ణతో పాటు వైస్ ప్రిన్సిపల్ వి.శ్రీనివాసమూర్తి, జెకెసి కోఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు అభినందించారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

ధాన్యం కొనుగోలు కోసం ఎదురుచూపులు

- కళ్లాల్లోనే ధాన్యం బస్తాలు
- నిరాశలో అన్నదాత



తామరకండి కళ్లాల్లో ఉన్న ధాన్యం బస్తాలు

ప్రజాశక్తి - సీతానగరం

కళ్లాల్లోనే ధాన్యం ఉండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. తమ ధాన్యం ఎప్పుడు ఏ మిల్లుకు వెళ్తాయని రైతులు ఎదురు చూస్తున్న పరిస్థితులు మండలంలో ఉన్నాయి. వేలాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పండిన పంట అమ్మకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వం ధాన్యం సేకరణ నిలిపివేయడంతో కళ్లాల్లోనే ధాన్యం బస్తాలు పోగులపడి కనిపిస్తున్నాయి. సంక్రాంతి ముందు ధాన్యం మిల్లులకు చేరాల్సిన ఉన్నప్పటికీ ప్రభుత్వ విధానాల ఫలితంగా ఈ క్రాప్ నెపంతో ధాన్యాన్ని కళ్లాల్లోనే ఉంచుకొని పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో తామరకండి, గెడ్డలుప్పి, ఏగోటివలస, కామన్నదొరవలస, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో ధాన్యం కళ్లాల్లోనే ఉన్నాయి. తామరకండిలో 15వేల బస్తాలు, లక్ష్మీపురంలో 4వేలు, గెడ్డలుప్పిలో 4వేల బస్తాలు, ఇలా ప్రతి గ్రామంలో ధాన్యం కొనుగోళ్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తొలుత అధికారులు 18వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అంచనా వేశారు. అయితే వీరి అంచనాలకు, ప్రస్తుత దిగుబడికి పొంతన లేకుండా పోయింది. ఇప్పటి వరకూ మండలంలో 22వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇంకా రైతుల వద్ద 5వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉన్నట్టు మండల వ్యవసాయాధికారులు గుర్తించారు. ఈ ధాన్యాన్ని ఎప్పుడు కొనుగోలు చేస్తారోనని రైతులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు నిలిపివేయడంతో వాతావరణంలో ఎప్పుడు ఏం జరుగుతోందనని రైతులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి తక్షణమే అధికారులు ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరారు.

ధాన్యం కొనుగోలు చేసే నాధుడే కరువు

నా వద్ద 200 బస్తాల ధాన్యం ఉన్నాయి. వీటిని కొనుగోలు చేసే నాధుడే కరువు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా తీసుకుంటానని చెప్పి ఇప్పుడేమో తీసుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాను. అధికారులను అడిగితే ప్రభుత్వం ఉత్తర్వులు వస్తేగానీ కొనుగోలు చేయలేమని చెప్తున్నారు. తక్షణమే స్పందించి ధాన్యాన్ని సేకరించాలి.

వై.శ్రీరాముల నాయుడు,
రైతు, తామరకండి.

తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రభుత్వం వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేపట్టాలి. మండలంలో అనేక గ్రామాల్లో ఉన్న ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలి. ధాన్యం సేకరణ నిలిపివేయడంతో అధికారులు స్పందించడం లేదు. ప్రభుత్వమైనా తక్షణమే స్పందించి ధాన్యం సేకరణ చేపట్టాలి.

బి అప్పారావు,
రైతు సంఘం నాయకులు

ధాన్యం కొనుగోలు చేయాలంటూ 4న తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు

కొమరాడ : రైతుల వద్ద ఉన్న ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేసి, మద్దతు ధర ఇవ్వాలని రైతు సంఘం నాయకులు ఉపేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫిబ్రవరి 4న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ మండల కేంద్రం వద్ద గోడ పత్రిక విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ఇంకా 40శాతం మంది రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయక నిల్వ ఉండే పరిస్థితి ఉందని తెలిపారు. వెంటనే రైతు వద్ద ఉన్న ప్రతి ధాన్యపు గింజను ఆర్‌బికె ద్వారా గిట్టుబాటు ధరఎ కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతూ ఫిబ్రవరి 4న తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగు ధర్నా రైతులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లక్ష్మణరావు, రాము, సింహాచలం, చిన్నంనాయుడు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని పెద్దింపేట, పెద పెంకి గ్రామాల్లో మిగిలి ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు పండించిన పంట ప్రభుత్వమే కొని, గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలు చేయకుంటే ఫిబ్రవరి 4న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు. ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి బలగ సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు నల్ల ఈశ్వరరావు, వెన్నెల వేణుగోపాలరావు, గిరిజన సంఘం నాయకులు దసరా గోపి, దాలియా గౌరీశ్వరరావు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధ రావు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు, నాయకులు

తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలి

మక్కువ : రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కొల్లి గంగు నాయుడు, చింతల తవిటినాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద ఉన్న ప్రతి గింజ ధాన్యం కొనుగోలు చేస్తామని ఉపన్యాసాలు చెప్పడం తప్ప ఆచరణలో కొనుగోలు చేయడం లేదని అన్నారు. సంక్రాంతి వరకు ప్రొక్యూర్‌మెంట్ చేసి ఆ తర్వాత నిలిపివేశారని అన్నారు. ఎప్పటిలాగే రైతులు పండగపోయిన తర్వాత నూర్పులు చేసి ధాన్యం అమ్ముకుందామని అనుకున్నారని అన్నారు. కానీ గత 15 రోజులుగా కొనుగోలు చేస్తామని పైనుంచి కింద వరకు ప్రకటనలు చేయడం తప్ప ఎక్కడా కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. మండలంలోని రైతులు వెంగళరావు సాగర్ ప్రాజెక్టు నీరు పొలాలపైకి రావడం వల్ల సకాలంలో వరి చేలు తెచ్చి నూర్పులు చేయలేకపోయారని కాబట్టి మండలంలో లక్ష ధాన్యం సంచుల వరకు నిల్వ ఉన్నట్లు ఫోటోలు తీసి వ్యవసాయ సిబ్బంది అప్లోడ్ చేసినప్పటికీ ఇంతవరకూ మక్కువ మండలానికి ప్రొక్యూర్‌మెంట్ ఇవ్వలేదని అన్నారు. కొన్ని మండలాల్లో పంచాయతీల వారీగా ప్రొక్యూర్‌మెంట్ ఇస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం విధానం మార్పు చేసుకొని రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని, లేకుంటే రైతు సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4న పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని అవసరమైతే రోడ్లు దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. స్థానికంగా నియోజక వర్గంలో ఉప ముఖ్యమంత్రి ఉన్నప్పటికీ రైతుల అనేక అవస్థలు పడుతున్నారని వెంటనే మంత్రి స్పందించి అధికారులతో మాట్లాడి మక్కువ మండలానికి పొక్యూర్‌మెంట్ ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఘనంగా పోలమాంబ మారు జాతర

ప్రజాశక్తి - మక్కువ

ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవత శంబర పోలమాంబ అమ్మ వారి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. మంగళవారం అమ్మవారిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకున్నారు. వనం గుడి వద్ద వేప చెట్టుకు భక్తులు పసుపు, కుంకుమ దీపదూపాలు సమర్పించుకొని పూజలు చేశారు. దేవాదాయ శాఖ అధికారి కెఎల్ సుధారాణి, కార్యనిర్వహణాధికారి పి.రాధాకృష్ణ భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. అలాగే ఆలయానికి వచ్చే భక్తులకు క్యూలైన్లలో తాగునీటిని సరఫరా చేశారు. భక్తులకు అమ్మవారి ప్రసాదాలు సరిపడేలా అందుబాటులో ఉంచారు. రహదారులు సక్రమంగా ఉండడంతో జాతరకు వచ్చే వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగలేదు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. స్థానిక సిఐ ధనుంజయరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. గత జాతర మాదిరిగానే ద్విచక్ర వాహనాలను ఊరి చివార్లో నిలిపివేశారు. వైద్య, ఆరోగ్యశాఖ స్థానిక ఆసుపత్రిలో సేవలందించడంతో పాటు ప్రత్యేక వైద్య శిబిరాలను డాక్టర్ రఘు ఆధ్వర్యంలో నిర్వహించారు. వనంపూడి సమీపాన గల స్థానిక జడ్పీ పాఠశాల వద్ద ఆర్‌టిసి బస్టాండ్ ఏర్పాటు చేసి భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను నడిపారు.



శంబరకు బారులు తీరిన జనం

అధిక సంఖ్యలో యాత్రికులు హాజరు



అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో ఉన్న భక్తులు

వినోదాలు ఎక్కడ..?

శంబర పోలమాంబ జాతర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది భక్తులకు వినోదాలు కరువయ్యా అనే తప్పదు. జాతరకు వచ్చే భక్తులంతా ప్రైవేటుగా ఎప్పుడు ఏర్పాటు చేసే వినోదాలు ఎక్కడున్నాయంటూ ఒకరికొకరు ప్రశ్నించుకోవడం కనిపించింది. ఈ ఏడాది స్థలం లేకపోవడంతో ప్రైవేట్‌గా ఏర్పాటు చేయాల్సిన వినోద కార్యక్రమాలు నిర్వాహకులకు ఆస్కారం లేకుండా పోయింది. అయితే చదునుగుడి సమీపంలో క్యూలైన్లు వద్ద దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిన గాన కచేరీలు భక్తులకు కొంత ఊరట ఇచ్చాయి.

లక్ష్యాలు పూర్తికి బాధ్యత వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

లక్ష్యాలు పూర్తి చేసేందుకు డివిజన్, మండల స్థాయి పర్యవేక్షణ అధికారులు బాధ్యత వహించాలని కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ శాఖల మండల స్థాయి అధికారులతో మంగళవారం కలెక్టరు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయం, అనుబంధ శాఖలైన ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్య శాఖ, బిందుసేద్యంలో అమలతున్న పథకాల పురోగతిని కలెక్టరు సమీక్షించారు. వ్యవసాయశాఖలో రబీ పంటకు సంబంధించి ఇ-పంట నమోదు పూర్తి చేయాలని తెలిపారు. ఇ-పంట, పి.ఎం.కిసాన్-ఇకెవైసీ నమోదులో అత్యల్ప పనితీరు కనబర్చిన మండల వ్యవసాయ అధికారుల నుంచి వివరణ కోరాలని, వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల పనితీరును క్రోడీకరించేందుకు ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ యాప్‌లో పూర్తి వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఆర్‌బికెలో ఏర్పాటు చేసిన కస్టమర్ హైరింగ్ సెంటర్లు పనితీరు, వారి ఆదాయ, లోను రీపేమెంటు వివరాలు సేకరించాలని తెలిపారు. మత్స్యశాఖకు సంబంధించి జనవరికి 42 యూనిట్లు లక్ష్యం కాగా, 38 యూనిట్లకు రుణాలు మంజూరు చేస్తామని, మిగిలిన యూనిట్లకు కూడా వెంటనే రుణం మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బిందు సేద్యానికి సంబంధించి తమ వాటా చెల్లించిన రైతులకు వెంటనే యూనిట్లను మంజూరు చేసి, గ్రౌండింగు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా మత్స్య అధికారి వేమూరి తిరుపతయ్య, జిల్లా పశు సంవర్ధక అధికారి ఎ.ఈశ్వర రావు, జిల్లా సూక్ష్మ నీటి అధికారి ఎల్.శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పనులు పూర్తి కావాల్సిందే

పనుల సీజన్ ... పనులు పూర్తి కావాల్సిందేనని కలెక్టర్ నిశాంత్ కుమార్ స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ పిఐయు విభాగం కింద జరుగుతున్న పనులపై కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మంజూరైన పిఎంజిఎస్‌వై,ఆర్‌సిపిఎల్‌డబ్ల్యుఇ, ఎపిఆర్.ఆర్.పి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అటవీ ప్రాంతంలో నిర్మించే రహదారులపై ఆ శాఖను సమన్వయం చేయాలని ఆదేశించారు. బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా వెంటనే అప్‌లోడ్ చేయాలని, అవసరం మేరకు త్వరగా విడుదలకు కృషి చేస్తామని తెలిపారు. పంచాయతీరాజ్ ఎస్ఇ ఎంవిఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ జిల్లాలో 28 పిఎంజిఎస్‌వై రహదారి పనుల్లో 13 పనులు పూర్తి చేశామని చెప్పారు. ఆర్‌సిపిఎల్‌డబ్ల్యుఇ కింద 35 రహదారి పనులు ఉండగా 17 పనులు పూర్తి చేశామని.6 బ్రిడ్జి పనుల్లో ఒకటి పూర్తి అయ్యిందని చెప్పారు. సమావేశంలో పాలకొండ ఇఇ రాధా రాణి, డిఇలు, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి ఇళ్లు సిద్ధం కావాలి : పిఒ

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ఉగాది నాటికి ఇళ్లు సిద్ధం కావాలని పార్వతీపురం ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ గృహ నిర్మాణ సంస్థ అధికారులను ఆదేశించారు. మండలంలోని పెద బుడ్డిడిలో గృహ నిర్మాణాల ప్రగతిని, గ్రామ సచివాలయం పనితీరును ఆయనతనిఖీ చేశారు. టి.కె.జమ్ములో గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. గృహ నిర్మాణాలపై దృష్టి సారించాలని ఆయన స్పష్టం చేశారు. జియో ట్యాగింగ్ ఉండాలని, నిర్మాణాలకు అవసరమైన సామాగ్రి త్వరితగతిన సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఉగాది నాటికి గహ ప్రవేశాలు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమని దానిని సాధించాలని ఆయన పేర్కొన్నారు. గ్రామ సచివాలయం ప్రజలకు మంచి సేవలు అందించాలని ప్రాజెక్టు అధికారి అన్నారు. ప్రభుత్వ పథకాల వివరాలు సచివాలయంలో అందుబాటులో ఉండాలని, ప్రజలకు తక్షణ సేవలు అందించడం ధ్యేయంగా ప్రతి ఉద్యోగి పనిచేయాలని సూచించారు. ముఖ ఆధారిత హాజరు ప్రతి ఒక్కరూ వేయాలని అయన సూచించారు.

ఉత్తమ బోధన... ఉత్తమ పోషణ ఉండాలి

టి.కె.జమ్ములో గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన పిఒ ఉత్తమ బోధనను విద్యార్థులకు అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఉత్తమ బోధన, నాణ్యమైన పౌష్టికాహారం అందించడంలో రాజీ పడరాదన్నారు. విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో తర్ఫీదు ఇవ్వాలన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత శిఖరాలు అందుకోవాలన్నారు. టెన్త్ విద్యార్థులకు అవసరమైన తర్ఫీదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న పిఒ విష్ణుచరణ్

ఎల్‌ఐసిపై ఎలాంటి అపోహలకు తావులేదు

పార్వతీపురంరూరల్ : అదాని కంపెనీల్లో ఎల్‌ఐసి పెట్టుబడులపై ఖాతాదారులు ఎలాంటి అపోహపడనక్కర్లేదని స్థానిక బ్రాంచి చీఫ్ మేనేజర్ టివి చలపతిరావు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఎల్‌ఐసి ఐఆర్‌డిఎ పరిధిలో పనిచేస్తున్న సంస్థ అని, తమ పెట్టుబడులు ఎఎ రేటింగ్ ఉన్న సంస్థల్లోనే ఉంచుతుందని అన్నారు. ఎల్‌ఐసి నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తుల విలువ రూ.41.66లక్షల కోట్లు కాగా, అదానీలో నిబంధనలను అనుసరించి పెట్టుబడులుగానీ, ఈక్విటీలుగానీ, రుణాల రూపంలో పెట్టింది రూ.36,475 కోట్లు అని, అంటే వాటి విలువ తమ ఆస్తుల్లో కేవలం ఒక శాతం కంటే తక్కువేనని అన్నారు. అయినా 2023 జనవరి, 27నాటికి వాటి మార్కెట్ విలువ రూ.56112.31 కోట్లుగా ఉందని, అలాగే చూసిన ఆ గ్రూపుల్లో తమ పెట్టుబడుల కన్నా రూ.16వేలు కోట్లు లాభాల్లో ఉన్నట్టేనని అన్నారు. అయితే అదానీ గ్రూప్ వివాదంలో తమ సంస్థను ప్రస్తావించడం పట్ల తమ కంపెనీ ఎండి స్థాయిలో సమీక్షిస్తుందని, ఈ వ్యవహారంలో ఖాతాదారులకు గానీ, సంస్థలకు గానీ ఎలాంటి సమస్యలేదని కావున ఎటువంటి అపోహలు, అనుమానాలకు తావులేదని, బీమాదారులకు, ఏజంట్లను, కోరుతున్నామని తెలిపారు.



సంకల్ప దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

సిపిఎస్ రద్దుకు సంకల్ప దీక్ష

ప్రజాశక్తి - కలెక్టరేట్

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తన పాదయాత్రలో సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చి ఐదేళ్లయ్యిందని, అధికారంలోకి వచ్చి వారం రోజుల్లోగా రద్దు చేస్తానని గద్దెనెక్కి ఇంతవరకు అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో సంకల్ప దీక్ష చేపడుతున్నట్లు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్‌రావు తెలిపారు. స్థానిక సుందరయ్య భవనంలో సంకల్ప దీక్ష పోస్టర్లను మంగళవారం విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 3న గన్నవరం సమీపాన సుందరయ్య విద్యానగర్లో గల ధర్మస్థలి ప్రాంగణంలో సంకల్ప దీక్ష సభ జరుగుతుందని, ఈ సభ జయప్రదానికి ఉపాధ్యాయులు, ఉద్యోగులు, హాజరుకావాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్‌కు బదులు జిపిఎస్ తీసుకురావడానికి ప్రయత్నిస్తుందని ఇది ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ఆమోదయోగ్యం కాదని, పదవీవిరమణ. పొందిన తర్వాత ఉద్యోగికి భద్రత కావాలంటే పాత పెన్షన్ విధానమే మంచిదని అన్నారు. ఇప్పటికే అనేక రాష్ట్రాలు సిపిఎస్‌ను రద్దు చేయాలని, కావున ముఖ్యమంత్రి కూడా ఒపిఎస్‌ను తీసుకురువాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె.మురళి, ఎన్.శ్రీను, కె.భాస్కరరావు, ఎన్‌వి రమణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి : డిఇఒ

వీరఘట్టం: పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌డివి రమణ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించిన సందర్భంగా మాట్లాడారు. పాఠశాలలో మరింత విద్య ప్రమాణాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఎప్పటికప్పుడు వారికి సబ్జెక్టులు వారీగా టెస్టులు పెట్టి విద్యా సామర్థ్యం పెంచేలా కృషి చేయాలన్నారు. అనంతరం 6,9 తరగతులను పరిశీలించారు. అలాగే ఇటీవల రౌతు హారిక, అత్తిలి కృష్ణ రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలు సాధించిన సందర్భంగా వారిని డిఇఒ అభినందించారు. క్రీడలతో పాటు చదువుపై కూడా దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. డిఇఒతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉప్పాడ అప్పారావు, వ్యాయమ ఉపాధ్యాయులు మజ్జి రామకృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డిఇఒ రమణ

సబ్ కలెక్టర్ దృష్టికి రైతుల గోడు

భామిని : ఏనుగుల వలన కలిగే పంట నష్టంపై ఘనసరా, తలడా, కేసరి, కొసలి రైతులు గ్రామాల రైతులు పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆయన స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో భూ రీసర్వేపై రెవెన్యూ, సర్వే అధికారులతో సమీక్షించారు. రైతుల ఫిర్యాదుతో ఘనసరాలో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. ఈ నాలుగు గ్రామాల పరిధిలోని సుమారు 1000 ఎకరాల్లో మొక్క జొన్న, మినుములు, పెసర, అరటి పంటలు ఏడాదికి మూడుసార్లు పండిస్తామని, ఎకరాకు సుమారు లక్ష ఆదాయం వచ్చే భూములని, పంట చేతికొచ్చే సమయం లో ఏనుగులు పంటలను ధ్వంసం చేస్తున్నాయని వాపోయారు. సోలార్ పంప్ సెట్లు పూర్తిగా ఏనుగులు నాశనం చేశాయని, ప్రభుత్వమే క్రాప్ హెలీడే ప్రకటించి రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని, సోలార్ పంప్ సెట్లు పూర్తిగా నాశనం కావటం తో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ పర్యటనలో ఘనసరా సర్పంచ్ కిల్లారి పాల్గుణరావు, కొసలి సర్పంచ్ మజ్జి మోహనబాబు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, తహశీల్దార్ అప్పారావు వున్నారు.



దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరల్ కమర్

రూ.11.47కోట్లతో మున్సిపల్ బడ్జెట్ ఆమోదం

సాలూరు : స్థానిక మున్సిపాలిటీకి సంబంధించి 2023-24 సంవత్సరానికి రూ.11 కోట్ల 47లక్షల 46వేల 500 అంచనాలతో బడ్జెట్‌ను మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మంగళవారం చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అజెండాలో ఉన్న అంశాలతో పాటు 2022-23 రివైజ్డ్ బడ్జెట్ అంచనాలు రూ.8కోట్ల 11లక్షల70వేల 098తో ఆమోదం తెలిపారు. మిగిలిన అజెండాలో ఉన్న అంశాలపై చర్చ లేకుండానే ఆమోదించారు. గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న డేటా ఎంట్రీ ఆపరేటర్ నియామకానికి సంబంధించి కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సమావేశంలో వైస్ చైర్మన్లు వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి, ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్‌రావు, కౌన్సిలర్లు గిరి రఘు, గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, ఎస్.ఈశ్వరరావు, రాపాక మాధవరావు, జర్జాపు నీలిమ, బి.విజయలక్ష్మి, పి.సన్యాసమ్మ, లింగాల దుర్గా , కమిషనర్ హెచ్ శంకరరావు, మేనేజర్ రాఘవాచార్యులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో డిడి పర్యటన

గుమ్మలక్ష్మీపురం: ఏజెన్సీలో విద్యా ప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఐటిడిఎ డిడి సూర్యనారాయణ సూచించారు. మండలంలోని పి.ఆమిటి ఆశ్రమ పాఠశాల, పిటిజి గురుకుల పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. టెన్త్ పరీక్షలకు అతి తక్కువ సమయం ఉండడంతో ప్రతి విద్యార్థి ఇప్పటి నుంచే కష్టపడి చదివితే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తన పర్యటనల భాగంగా పి.ఆమిటి పంచాయతీ వంజరాపుగూడ వెళ్లి రైతులతో మాట్లాడారు. ఏఏ రైతు వద్ద ఎన్ని బస్తాలు అమ్మకానికి సిద్ధంగా ఉంచారో అమ్మకానికి సిద్ధంగా ఉంచారో వివరాలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో కొనుగోలు లేక తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. .

వ్యవసాయ అధికారిని సస్పెండ్ చేయాలి

వీరఘట్టం : ధాన్యం కొనుగోలులో మిల్లర్లతో కుమ్మక్కైన మండల వ్యవసాయ అధికారిని తక్షణమే సస్పెండ్ చేయాలని టిడిపి పాలకొండ నియోజకవర్గం బాధ్యులు నిమ్మక జయకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ జయకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని, దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తున్న వైసిపి ప్రభుత్వమేనని అన్నారు. 81 కేజీలకు బదులుగా 84 కేజీలు తీసుకుంటున్న మిల్లర్లపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం టిడిపి కార్యాలయం నుండి ప్రధాన రహదారి మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ప్లకార్డులు చేత పట్టుకుని నినాదాలు చేశారు. అనంతరం ఇన్చార్జి తహశీల్దార్ చందక సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కర్నేని అప్పలనాయుడు, మండల అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, ఎఎంసి మాజీ చైర్మన్ పి.కృష్ణమూర్తి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎ.వెంకంపేటలో గడ్డివాములు దగ్ధం

మక్కువ: మండలంలోని ఎ.వెంకంపేట పంచాయతీలో మంగళవారం రాత్రి రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన యాల కురుమనాయుడు, ఈశ్వరరావుకు చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. సుమారు రూ.30 వేల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు.

పురస్కారానికి జగదీష్ ఎంపిక

కురుపాం : యశస్వి సాహితీ పురస్కారానికి కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మల్లిపురం జగదీష్ ఎంపికయ్యారు. ఫిబ్రవరి 11న గుంటూరులో త్యాగరాజ సాంస్కృతిక సంఘంలో పురస్కారం అందుకోనున్నారు. ఇది జగదీష్‌కు రావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామగోవిందం, వసతి గృహసంరక్షణ అధికారి కె.సూర్యనారాయణ, పాఠశాల సిబ్బంది, ఈ ప్రాంత వాసులు ఆయనకు అభినందనలు తెలిపారు.

గ్రీన్ అంబాసిడర్లకు దుప్పట్లు పంపిణీ

గుమ్మలక్ష్మీపురం : ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురం పంచాయతీల్లో ప్రతిరోజు పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు చలి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని దోస్త్ మేరా దోస్త్ గ్రూపు సభ్యుల సహకారంతో మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బి. గౌరీ శంకర్రావు, వైస్ ఎంపిపి ఎస్.శేఖర్, మాజీ సర్పంచ్, దేశమేరా దోస్త్ గ్రూపు అధ్యక్షులు పాలక ప్రేమానంద్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొత్తకోట కిషోర్, వర్తక సంఘం అధ్యక్షులు కొత్తకోట విష్ణు, వైశ్య సంఘం అధ్యక్షులు గుడ్ల హరిప్రసాద్, దోస్త్ మేరా దోస్త్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర రోడ్డు పనుల పరిశీలన

పార్వతీపురంరూరల్ : రూ.17కోట్ల నిధులతో జరుగుతున్న అంతర్‌రాష్ట్ర రహదారి పనులను మంగళవారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు మండలంలోని చినబొండపల్లిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు విస్తరణతో ఆంధ్రా-ఒడిషాకు రవాణాతో పాటు రాకపోకలకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. వెంకంపేట, చినబొండపల్లి, ఎమ్మార్‌నగరం గ్రామాల్లో కాలువల నిర్మాణాలు లేకపోవడంతో వాడుకనీరు ప్రధాన రహదారిపై చేరి ప్రజలకు అసౌకర్యంగా ఉండేదని, రహదారుల విస్తరణతో పాటు కాలువల నిర్మాణంతో ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ

మండలంలోని చినబొండపల్లి దళిత కాలనీలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు చీరలు పంపిణీ చేశారు. కొద్దిరోజుల క్రితం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నప్పుడు క్రిస్మస్ కానుకలు కోరిన మహిళలను గుర్తించుకొని ఈ పంపిణీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గండి శంకరరావు, ఎంపిటిసి బంకురు రవికుమార్, నాయకులు మిరియాల కామేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టూరులో కుష్టునివారణ వారోత్సవాల ర్యాలీ

పార్వతీపురంరూరల్ : మండలంలోని పుట్టూరులో మంగళవారం పెదబొండపల్లి పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది కుష్టువ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ, విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుంట్రెడ్డి సతీష్ కుమార్, సిబ్బంది శంకరరావు, నాగలక్ష్మి, ఆశాలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడపగడపకు

సాలూరు : ప్రజా సమస్యల్ని తెలుసుకుని పరిష్కరించడానికే గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టినట్లు డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆరోవార్డు పరిధిలో ఉన్న జర్జాపు వీధి, అగురువీధుల్లో ఆయన ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. మూడున్నరేళ్లలో దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు సంక్షేమ పథకాల లబ్ధి జరిగిందన్నారు. అర్హులైన వారుంటే రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, వైస్ చైర్ పర్సన్ దీప్తి, కౌన్సిలర్ జర్జాపు నీలిమ, గిరిరఘు, గొర్లి వెంకటరమణ, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ పాల్గొన్నారు.

తలవరం విద్యార్థికి బంగారు పతకం

వీరఘట్టం : మండలంలోని తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బొద్దాన రాజు అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయిలో బంగారు పతకం లభించిందని ప్రధానోపాధ్యాయులు ఉప్పాడ అప్పారావు మంగళవారం తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా నందికొట్కూరులో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ స్కూల్ గేమ్స్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించడంతో బంగారు పతకం లభించిందని ఆయన తెలిపారు. పాఠశాలకు వరుసగా మూడు బంగారు పతకాలు రావడంతో సర్పంచి ఎస్.మధుసూదన్ రావు, పిఎంసి చైర్మన్ అల్లు శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

బోధనేతర పనుల నుంచి టీచర్లను మినహాయించండి

పార్వతీపురం టౌన్ : విద్యాబోధనకు ఆటంకంగా ఉన్న విద్యాయేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్(ఫోర్టో) చైర్మన్ కరణం హరికృష్ణ, సెక్రటరీ జనరల్ సామల సింహాచలం మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విద్యా సంవత్సరం త్వరలోనే ముగుస్తున్నందున, ఉపాధ్యాయులకు తగినంత సమయం ఇవ్వాలని, అంతవరకు టీచర్లపై చర్యలు లేకుండా ప్రిన్సిపల్ సెక్రటరీ మానవతా దక్పథంతో తగు ఆదేశాలు జారీ చేయాలని ఫోర్టో పక్షాన విజ్ఞప్తి చేస్తున్నామని పేర్కొన్నారు.

గోరుముద్ద పరిశీలన

పాలకొండ రూరల్ : మండలంలో బుక్కూరు ఎంపియుపి పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపిడిఒ డొంక త్రినాధులు మంగళవారం పరిశీలించారు. ఎంత మంది విద్యార్థులు ఉన్నారు, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారా అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజన వండించాలన్నారు.

నీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు

పాలకొండ : నీటి సరఫరా పునరుద్ధరించేందుకు నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు చర్యలు చేపట్టారు. రెండు రోజుల నుంచి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పైపులైన్లు పగిలిపోవడంతో దాన్ని దగ్గరుండి ఇంజనీరింగ్ అధికారులు మరమ్మతులు చేయిస్తున్నారు.

జగనన్న లే అవుట్లలో గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని వెంకంపేట, గోపాలపురంలో ఉన్న జగనన్న లేఅవుట్లలో ఇంటి స్థలాల మంజూరు లబ్ధిదారుల గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పలనాయుడు లబ్ధిదారులతో అన్నారు. మంగళవారం పట్టణంలోని 1, 15 సచివాలయాల్లో లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆయా లే అవుట్లలో ఇళ్ల స్థలాల మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని, నిర్మాణాలు చేసుకునేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని, సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామని సూచించారు. సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, ఇమ్యూనిటీ సెక్రటరీలు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

ఐటిడిఎ పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేయాలి

కలెక్టరేట్ : పార్వతీపురం ఐటిడిఎ పాలకవర్గ సమావేశం నిర్వహించి గిరిజన సమస్యలను పరిష్కరించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు వి.రంజిత్‌కుమార్, సాయిబాబు కోరారు. బోధనా, బోధనేతర సిబ్బంది నియామకం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. వసతిగృహ సంక్షేమ అధికారులు (వార్డెన్, మేట్రిన్)పోస్టులు భర్తీ చేయాలని కోరారు. రాత్రి వేళల్లో కళాశాల వసతి గృహంలో విద్యార్థులు ఉండడంలేదని బయట రూంలు అద్దెకు తీసుకుంటున్నారనే వదంతులపై కూడా సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు.

స్పందన నిర్వహించాలి

ఐటిడిఎ పిఒ ఆధ్వర్యంలో గిరిజన ప్రజల కోసం ప్రత్యేకంగా స్పందన నిర్వహించాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ప్రతి శుక్రవారం ఐటిడిఎ కార్యాలయంలో గిరిజన స్పందన నిర్వహించాలని కోరారు.

సమస్యలు బోలెడు... పరిష్కారమెప్పుడో?

ప్రజాశక్తి-కురుపాం, పార్వతీపురం రూరల్, పాచిపెంట, జియ్యమ్మవలస

సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా గ్రామ స్వరాజ్యం వచ్చిందని చెబుతున్న పాలకులు, అధికారులు ప్రజా సమస్యల పరిష్కారం పట్ల మాత్రం సరైన చర్యలు తీసుకోవడం లేదు. కొన్ని సమస్యలు వెను వెంటనే పరిష్కారమవుతున్నప్పటికీ భూ సంబంధిత సమస్యలైన మ్యుటేషన్లు, భూ ఆక్రమణలు, రేషన్‌కార్డుల మంజూరు తదితర వాటికి మాత్రం రోజుల తరబడి సచివాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రజాశక్తి సచివాలయాలను పరిశీలించింది. ఈ సందర్భంగా పలు విషయాలు వెల్లడయ్యాయి. పలు సచివాలయాలకు ప్రజలెవరూ రాకపోవడంతో ఉద్యోగులంతా ఖాళీగా కనిపించారు. కొన్ని చోట్ల పలు సమస్యలపై ప్రజలు వచ్చి దరఖాస్తులు అందజేశారు. సీతానగరం మండలం పెదబోగిలి గ్రామ సచివాలయం పెన్షన్ కోసం జగనన్న తోడు పథకం కోసం వచ్చిన పలువురు అర్జీదారులు వచ్చారు. పాచిపెంట సచివాలయం-2 వద్దకు చేదోడు పథకం కోసం రదఖాస్తు చేసుకొనేందుకు లగడ తోటమ్మ. తల్లిదండ్రులు జలగడ గంగరాజు, రాములమ్మ.దరఖాస్తు చేసేందుకు వచ్చారు. అయితే కొత్త దరఖాస్తులు పెట్టుకోవడానికి జనవరి 27చివరి తేదీ అని గ్రీవెన్స్ అనే ఆప్షన్ ప్రభుత్వం కల్పిస్తుంది ఆ అవకాశం వస్తే దరఖాస్తు ఆన్లైన్ చేయడం జరుగుతుందని దరఖాదారులు తెలిపారు.

సచివాలయాల పరిశీలనలో వెల్లడి



సేవలు ఫర్వాలేదు...

గ్రామ సచివాలయ సేవల ద్వారా అందుతున్న సేవలు ఫర్వాలేదని కన్నందొరవలస గ్రామస్తులు పలువురు తెలిపారు. మంగళవారం స్థానిక సచివాలయాన్ని 'ప్రజాశక్తి' పరిశీలించింది. ఈ సమయంలో నలుగురు గ్రామస్తులు వివిధ సమస్యలపై సచివాలయానికి గొట్టాపు గంగమ్మ కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకోడానికి వచ్చారు. మంత్రబుడ్డి శివు నాయుడు మధుమేహం ఇన్సులిన్ కోసం వచ్చారు.

ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందజేయాలి

అడ్డాపుశీల సచివాలయంలో కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్ల కోసం వారం రోజుల క్రితం దరఖాస్తు చేసుకున్నాను. నేటికీ వరకూ రాలేదు. దీంతో చేదోడు పథకానికి దరఖాస్తు చేసుకొనేందుకు సమయం మించిపోతుంది.కావున ధ్రువీకరణపత్రాలు సకాలంలో అందజేసేలా చర్యలు తీసుకోవాలి.

అలుగు వెంకటరమణ,
పిన్నింటి రామునాయుడువలస,
పార్వతీపురం మండలం.

ముటేషన్ కోసం ముప్ప తిప్పలు

కురుపాం మేజర్ పంచాయితీ సచివాలయం -1 పరిధిలో మా గ్రామం కాటదొరవలస ఉంది. మా మామ చనిపోయారు. ఆయన తధానంతరం ఆయనకు ఉన్నటువంటి రెండు ఎకరాల భూమికి హక్కుదారులంజ మేమే కనుక ఆ భూమి మా పేరును మార్పించడానికి సచివాలయం చుట్టూ సుమారుగా రెండు నెలలుగా తిరుగుతున్నప్పటికీ కనీసం సచివాలయ విఆర్ఒ ఇదిగో చేద్దాం... ఇదిగో చేద్దాం... అంటున్నారు తప్ప పని అయితే జరగడంలేదు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల వద్దకు సేవలు అందించడానికి పెట్టిన ఈ సచివాలయంలో మా పని జరగడం లేదు. పై అధికారులు స్పందించి మా పని అయ్యే దిశగా పరిష్కరించాలని కోరుతున్నాను.

ఆరిక రూపవతి , కాటందొరవలస,
కురుపాం మేజర్ పంచాయతీ.



వ్యవసాయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న రాష్ట్ర వ్యవసాయాధికారి ప్రేమ్‌కుమార్

పొలంబడి పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ఆర్.వెంకంపేటలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మేలైన యాజమాన్య పద్ధతులు (జిఎపి), పొలంబడి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయ ఎడిఎ ప్రేమ్‌కుమార్ సందర్శించి రైతులతో జిఎపి, పొలంబడి కార్యక్రమం నిర్వహణా విధానాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఇందులో రైతులు ఏ రకం విత్తనాలు వాడుతున్నారు, వాటి దిగుబడి ఏ విధంగా వస్తుందని కనుక్కున్నారు. అలాగే రైతులు చేసిన పొలం పర్యావరణ పరిసరాల విశ్లేషణను పరిశీలించారు. అలాగే విత్తన శుద్ధి, బ్యాలెట్ బాక్స్ టెస్ట్ ద్వారా మిత్ర, శత్రు పురుగులపై రైతులకు ఉన్న పరిజ్ఞానం తెలుసుకుని, ఎంట్రీ పాయింట్ ఆక్టివిటీ ద్వారా పురుగు మందులు స్ప్రే చేసేటప్పుడు జరిగే చర్యలు, స్ప్రే చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులను అడిగారు. కలుపు నివారణ చర్యలు, ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, మొక్కల్లో వచ్చే పోషక లోపాలు, వాటి నివారణా చర్యలు గూర్చి చర్చించారు. అలాగే పొలంబడిలో మెలుకువలు, ఉపకరణాలు కావాలంటే తెలియజేయాలన్నారు. నూతన విధానాలు ఏమైనా అవలంభించాలనుకున్నా తెలపాన్నారు. అలాగే పొలంబడి రికార్డులు తనిఖీ చేసి ప్రతి వారం రైతులతో గ్రామ వ్యవసాయ సహాయకులు పొలంబడి నిర్వహించాలన్నారు. మేలైన పద్ధతులు నేర్చుకోవాలని రైతులకు తెలిపారు. అలాగే ఈ జిఎపి సర్టిఫికేషన్ ద్వారా పండించే పంటలకు మంచి గిట్టుబాటు ధర వస్తుందన్నారు. కార్యక్రమంలో పొలంబడి జిల్లా కో ఆర్డినేటర్ ఆర్.శ్రీనివాసరావు, పార్వతీపురం ఎడిఎ టి.వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయధికారి ఎస్.అవినాష్, గ్రామ సర్పంచ్ పి. శ్రీనివాసరావు, 10 క్లస్టర్ గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

బిటి రోడ్డు నిర్మాణానికి రూ.2. 60 కోట్లు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని బంగారు వలస పంచాయతీకి తారురోడ్డు నిర్మాణానికి రూ.2.60కోట్లు మంజూరైనట్లు వైసిపి నాయకులు మావుడి రంగు నాయుడు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక సర్పంచ్ ఎస్.హరికృష్ణతో కలిసి రహదారి పనులకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల రహదారులకు వైసీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

4వేల మందికి ఉపాధి కల్పించాలి : పిఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రతి రోజూ 4వేల మంది ఉపాధి పనిలో పాల్గొనేలా చూడాలని సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బి.నవ్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి బి.నవ్య మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో 3150 మంది ఉపాధి పనిలో పాల్గొంటున్నారని, మరి ఇంత సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి వేతనదారునికి కనీస వేతనం రూ.220 తక్కువ ఉండకూడదన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ ఉపాధి ఉపాధి కల్పించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎవరైతే ఇంకా గృహాలు ప్రారంభించలేదో అటువంటి వారికి అవగాహన కల్పించి గృహ నిర్మాణాలు చేపట్టేందుకు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎ.ప్రభాకర్ రావు, ఉపాధి ఎపిడి జి శ్రీహరిరావు, ఎపిఒ జి.సత్యంనాయుడు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



పాలకొండ: సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ నవ్య

పాలకొండ :ఉపాధి పనులు సక్రమంగా చేపట్టాలని ఐటిడిఎ పిఒ బి.నవ్య అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడేలా పనులు చేపట్టాలన్నారు. ఉపాధి కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పనివేళలు సక్రమంగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వేతనాలు కూడా సకాలంలో చెల్లించాల న్నారు. ఆమెతో పాటు ఎంపిడిఒ డొంక త్రినాధులు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.


వంతెనలు వణికిస్తున్నాయి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని వంతెనలు, ప్రయాణికులను వణికిస్తున్నాయి. శిథిలమైన వంతెనలపై ప్రయాణించాలంటే వాహనచోదకులు బిక్కుబిక్కుమంటున్నారు. ప్రమాదకరమైన ఈ వంతెనల వద్ద సంబంధిత అధికారులు కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో పలువురు ప్రమాదాల బారినపడి ప్రాణాలను సైతం వదిలేస్తున్నారు. మండలంలో కురుపాం నుంచి గుమ్మలక్ష్మీపురం వరకు గల రోడ్డులో సుమారు రెండు వంతెనలు ఉన్నాయి. అయితే గుమ్మగదబవలస దగ్గర ఉన్న వంతెన వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పి.లేవిడి నుంచి నీలకంఠపురం వెళ్లే రహదారిలో రెండు వంతెనలు ఉన్నాయి. మొండెంఖల్ సమీపాన గల వంతెనకు చిన్న రక్షణ గోడ ఉండేది. అది కూడా ఇప్పుడు కూలిపోయింది. సరే కదా వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కనీసం ఇవి మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో అటు వైపు వెళ్లిన ప్రయాణికులు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెనల మరమ్మతులు చేపట్టి హెచ్చరిక బోర్డులను పెట్టి వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని కోరుతున్నారు.



మొండెంఖల్ వద్ద రక్షణ గోడ కూలిపోయిన వంతెన



పాస్ పుస్తకాలు అందజేస్తున్నఎమ్మెల్యే జోగారావు

'వైఎస్సార్ భూరక్ష'తో వివాదాలకు చెల్లుచీటి

పార్వతీపురంరూరల్ : భూ వివాదాలు, భూ తగాదాల్లేని గ్రామాలు ఉండాలి అన్నదే జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షా పథకం ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మంగళవారం మండలంలోని చినబొండపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో గల రైతన్నకు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ సమగ్ర సర్వే ద్వారా గ్రామంలో అన్ని భూ వివాదాలు పరిష్కారమవుతాయని, దశాబ్దాల తరబడి నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఏ ఒక్క రైతు భూ పట్టాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, ఎవరికీ ఒక్క రూపాయి కూడా లంచం చెల్లించకుండా మీ వద్దకే మీ భూమి హక్కు పత్రాలు అందచేసిన తమ ప్రభుత్వానిదేనని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్ ఎంపిపి సిద్ధ జగన్నాధరావు, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, గ్రామ సర్పంచ్ గండి శంకర్రావు, ఎంపిటిసి సభ్యులు బి.రవికుమార్, వివిధ గ్రామాల సర్పంచ్లు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా సొమ్ము అందజేత

సాలూరు : పట్టణంలోని 19వార్డుకు చెందిన పి.వెంకటరమణ, శాంతికుమారి కుమారుడు ఇటీవల గుండెపోటుతో మరణించడంతో వారికి వైఎస్సార్ బీమా కింద మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ రూ.10వేల నగదు అందజేశారు. మంగళవారం వార్డు సచివాలయంలో చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ శాంతికుమారి చేతికి అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలు పంపిణీ చేశారు.

వైసిపి కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని బెలగాంలో మంగళవారం యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ జిల్లా నూతన కార్యాలయానికి శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర, జిల్లా పార్టీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు, టిడ్కో రాష్ట్ర చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్, కార్పొరేషన్ చైర్ పర్సన్ డాక్టర్ రంగుముద్రి రమాదేవి, జిల్లా స్థాయి ప్రజా ప్రతినిధులు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడా నాగేశ్వరరావు, రాష్ట్ర ఎస్‌సి సెల్ సభ్యులు సవరపు జయమణి, మున్సిపల్ ప్రజా ప్రతినిధులు, జిల్లా పరిధిలో గల ప్రజా ప్రతినిధులు, ఎంపిపి, జెడ్‌పిటిసి సభ్యులు, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్లు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిఐ, ఉపాధి చట్టాలపై యువతకు అవగాహన

కురుపాం : సమాచార హక్కు, ఉపాధి హామీ చట్టాలపై యువతకు తప్పనిసరిగా అవగాహనఉండాలని ఉపాధి హామీ అంబుడమెన్ సన్యాసిరాజు అన్నారు. మంగళవారం స్థానిక పెన్షనర్ల భవనం వద్ద యూత్ ఎంపవర్‌మెంట్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో లిబ్ టెక్ ఇండియా సహకారంతో యూత్ ఎంపవర్‌మెంట్ సర్వీస్ సొసైటీ సంస్థ డైరెక్టర్ షేక్ గౌస్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సక్రమ మార్గంలో పయనించి చట్టాలపై అవగాహన పెంచుకోవాల న్నారు. ఉపాధి హామీ చట్టం అమలులో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. లిబ్ టెక్ సంస్థ ప్రతినిధులు కిషోర్, కృష్ణ ఉపాధి హామీ, సమాచార హక్కు చట్టాలపై అవగాహన కల్పించి, సమాచార హక్కు ద్వారా సమాచారం ఎలా పొందాలి, దరఖాస్తు నింపే పద్ధతిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక యువత పాల్గొన్నారు.

వేగ నియంత్రణ కోసం స్టాపర్లు ఏర్పాటు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్‌ల ఆధ్వర్యంలో రహదారి భద్రత కోసం ఎల్విన్‌పేట- పి.లేవిడి మార్గమధ్యలో వాహనదారులు వేగనియంత్రణకు స్టాపర్స్ బోర్డులను ఎల్విన్‌పేట పోలీసులు మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు వేగ నియంత్రణ చర్యలు ముమ్మరంగా చేపడుతున్నామన్నారు. ఈ మేరకు ఎల్విన్‌పేట సర్కిల్ పరిధిలో ఎక్కడికక్కడ స్టాపర్స్ బోర్డులు, డ్రమ్ములకు వివిధ రకాల పెయింటింగ్స్ వేసి, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, కుటుంబ సభ్యులతో వెళ్లేటప్పుడు వేగంగా వెళ్లకుండా జాగ్రత్తగా ప్రయాణించాలని అన్నారు.

లుంబేసులో 'ఇదేం కర్మ'

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనతో ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని లుంబేసులో ఇదేం కర్మ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గిరిజనులు ఆమెకు హారతులతో స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. వైసిపి మూడున్నర ఏళ్ల కాలంలో రాష్ట్రంలో ఇసుక, మద్యం మాఫియా రాజ్యమేలుతుందన్నారు. గిరిజనుల కష్టాలు పోవాలంటే, అందరి బతుకులు బాగుపడాలంటే రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. లోకేష్ పాదయాత్రలో యువత పాల్గొని సంఘీభావం తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు అడ్డాకుల నరేష్, తోయక జానకి, తదితరులు పాల్గొన్నారు.

భామిని : మండలంలోని నులకజోడులో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జయకృష్ణ మాట్లాడుతూ నిధులు విడుదల చేసిన వడ్డంగి లిఫ్ట్ ఇరిగేషన్ ఎందుకు ఆగిందని, కొండ లోయగెడ్డ రిజర్వాయర్ పనులు ఎందుకు ఆపారని, మండల అభివృద్ధిపై నియోజకవర్గ ప్రజాప్రతినిధికి దక్షత ఉందా అని ప్రశ్నించారు. ఐటిడిఎ నిధులతో వ్యక్తిగత అతిథి గృహాలకు రోడ్లు నిర్మించుకోవచ్చానని ప్రశ్నించారు. రాష్ట్రంలో సామాన్యుడి జీవనం అస్తవస్తంగా ఉదన్నారు. కావున టిడిపిని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు బోగాపురపు రవినాయుడు, టిడిపి కమిటీ సభ్యులు భూపతి ప్రభాకర్, సర్పంచ్ లోపింటి రాజేష్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లుంబేసులో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గ్రామ స్థాయిలో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలంతా పూర్తిగా వినియోగించుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు అడ్డూరివలసను ఆయన సందర్శించి వైద్యాధికారి డాక్టర్ అనూష ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఒపి నిర్వహణ రికార్డులను, రక్త పరీక్షలను పరిశీలించారు. ఆరోగ్య తనిఖీల వివరాలు ఎప్పటికప్పుడు రికార్డుల్లో, ఆన్లైన్‌లో నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం స్థానికులకు పలు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించి, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, 104 సిబ్బంది , ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని నడిమికెళ్లలో మంగళవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ఎస్.తనూజ గర్భిణీలు, బాలింతలు, మధుమేహ, రక్తపోటు, చంటి పిల్లలు, తదితరమైన వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోనే అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు పోషకాహారం సక్రంగా పంపిణీ చేయాలని కార్యకర్తకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ ఒ.శాంతకుమారి, ఎఎన్ఎం బి.శకుంతల, టెక్నీషియన్ దినేష్, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.